సొంతింటితోనే పేదల ఆత్మగౌరవం

- రాబోయే రెండేళ్లలో నాలుగున్నర లక్షల ఇళ్లు
- నియోజకవర్గానికో ఎటిసి కేంద్రం.. ఉపాధికనుగుణంగా నైపుణ్యాల పెంపు
- విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులతో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొంతింటితోనే పేదలకు ఆత్మగౌరవం దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆత్మగౌరవం నిలిపేలా ఇందిరాగాంధీ తీసుకొచ్చిన 'రోటీ కపడా ఔర్ మకాన్' నినాదం సాకారం దిశగా కాంగ్రెస్ పాలన సాగుతోందన్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న ఇండ్లే కాక రాబోయే రెండేండ్లలో నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నియోజకవర్గానికో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఎటిసి)ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గాల వారీగా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపిలతో మంత్రులు సమావేశాలు ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దామరచర్లలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సభలో సిఎం ప్రసంగించారు. కమ్యూనిస్టులు సైతం ప్రభుత్వానికి అండగా నిలబడ్డారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 25 లక్షల ఇళ్లను కట్టించిన విషయాన్ని గుర్తు చేశారు. హనుమాన్ గుడిలేని గ్రామాలు, తండాలు ఉండొచ్చు కానీ ఇందిరమ్మ ఇండ్లు లేని ఊరు ఉండొద్దని నిర్ణయించుకున్నామన్నారు. నాడు పోడు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత కరెంట్.. రాజశేఖర్‌రెడ్డి ఇచ్చారని తెలిపారు. కెసిఆర్ పదేళ్ల పాలనాకాలంలో కొత్త రేషన్‌కార్డు ఎట్టుంటదో తెలియదని, కోడలు ఇంటికొస్తే.. ఆడపిల్లను ఓ ఇంటికిస్తే కార్డుల్లో పేరు ఎక్కలేదని అన్నారు. పదేండ్లు కార్డుల కోసం కండ్లు కాయలు కాచేలా చూశారని తెలిపారు. రాబోయే పదేండ్లు ఇందిరమ్మ రాజ్యమే ఉండాలని, పేదలందరికీ ఇండ్లు కట్టించాలని ఆకాంక్షించారు. అందుకు అధికారులు సహకరించాలని కోరారు. భూములు అందుబాటులో లేనందున పేదల పిల్లలను ప్రయోజకులను చేసేందుకు రూ.45 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను స్థాపిస్తున్నామని తెలిపారు. "పేదలూ చదువుకోండి.. చదువుకేమి కావాలో అడగండి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిని ప్రశంసలతో ముంచెత్తారు. ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి ఉన్న జిల్లా అని, అందుకే కీలక శాఖలన్నీ ఈ జిల్లాకే ఇచ్చానని తెలిపారు. అంతకుముందు ఇండ్ల గృహప్రవేశాల అనంతరం లబ్దిదారులతో ముచ్చటించారు.

పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేదల ఆత్మగౌరవం ఇండ్లని, అటువంటి ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదల కోసం పనిచేస్తే కమీషన్‌లు రావని నాటి ప్రభుత్వం భావించిందని, కానీ పేదలతోనే ఆత్మగౌరవం అని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కేసీఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలో 119 ఇండ్లు కట్టించామన్నారు. నాడు కేసీఆర్‌ను ఇల్లు ఇవ్వమని అడిగిన అవ్వ ఇల్లు కూడా నెలరోజుల్లో పూర్తవుతుందన్నారు. ఈ సభలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, కొత్తగూడెం, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, మాలోత్ రాందాస్‌నాయక్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, హౌసింగ్ ఎండీ ఎంవీ గౌతమ్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, వరంగల్ రేంజ్ ఐజీ చంద్రశేఖరరెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

- బిఆర్ఎస్, కవిత వ్యాఖ్యలకు సిఎం రేవంత్‌రెడ్డి కౌంటర్

"కాంగ్రెస్ పార్టీని బతకనివ్వబోమన్నారు.. శాసనసభ్యుల మీద అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారు.. ఇవాళ వాళ్లే తన్నుకుని చస్తున్నారు.. ఒకరినొకరు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటున్నారు. వాళ్లను వాళ్లే పొడుచుకునే పరిస్థితి వచ్చింది. అవినీతి సొమ్ము పంపకాల్లో తేడా వచ్చి కుటుంబంలో తగాదాలు పెట్టుకుంటున్నారు..

పాపం ఊరికే పోదు.. ఒకరి వెనుక ఒకరు ఉన్నారని కొందరు మాట్లాడుతున్నారు. అంత చెత్తగాళ్ల వెనుక నేనెందుకు ఉంటాను.. నేను నాయకుడిని.. ఉంటే ముందుంటా.. నా వాళ్లకు తోడుగా ఉంటా.. వాళ్ల కుటుంబంలో వాళ్లు వాళ్లు కత్తులతో పొడుచుకుని హరీశ్, సంతోష్ వెనుక రేవంత్ రెడ్డి ఉన్నారని ఒకరంటే.. లేదు లేదు కవిత వెనుకాల రేవంత్ రెడ్డి ఉన్నారని ఇంకొకరంటున్నారు. మీరంతా దిక్కుమాలిన వారని తెలంగాణ ప్రజలు బండకేసి కొట్టారు.. అన్నం తినేవారు ఎవరైనా మీ వెనుక ఉంటారా? దయచేసి మీ కుటుంబ పంచాయితీలో.. మీ కుల పంచాయితీలోనో.. మమ్మల్ని లాగకండి" అని బీఆర్ఎస్ నేతలకు, కవితకు సీఎం హితవు పలికారు.



కల్నల్ హర్పల్‌సింగ్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు

విధుల్లో చేరిన ఇరిగేషన్ అడ్వైజర్ హర్పల్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల శాఖా సలహాదారుడిగా నియమితులైన లెఫ్టినెంట్ జెనరల్ కల్నల్ హర్పల్‌సింగ్ సోమవారం విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసేందుకు రూపొందించిన ఎస్ఎల్‌బిసి పనుల పునరుద్ధరణ కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు లెఫ్టినెంట్ జెనరల్ హర్పల్ సింగ్ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు అదిత్యా దాస్‌నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె శ్రీనివాస్‌తో పాటు ఈఎన్సీలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్‌బాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన లెఫ్టినెంట్ జెనరల్ హర్పల్‌సింగ్ టన్నెల్ నిర్మాణ రంగంలో అపార అనుభవం గడించిన దృష్ట్యా ఆయన్ను ఈ శాఖలో నియమించిన విషయం విదితమే. ముఖ్యంగా మూడు లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు ఫ్లోరోసిస్ బారిన పడిన నల్లగొండ జిల్లా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో సర్కారు ఈ నియామకం చేసింది. ఎస్ఎల్‌బిసి సొరంగమార్గం తవ్వకంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం, లెఫ్టినెంట్ జెనరల్ హర్పల్‌సింగ్ అనుభవాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఈ నియామకం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన కారణంగా, ఎస్ఎల్‌బిసి పనులు పూర్తి చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నియమించిన నేపథ్యంలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తేనుంది. ఈ క్రమంలోనే సొరంగ మార్గం తవ్వకాలలో అపార అనుభవం గడించిన హర్పల్ సింగ్ సేవలు వినియోగించుకోవాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

రేపు శిల్పకళావేదికలో ఉపాధ్యాయ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు ప్రత్యేక అతిథులుగా శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు విశిష్ట అతిథిగా సీఎస్ కె రామకృష్ణారావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేస్తారు. వారిని సన్మానించడంతోపాటు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం, శాలువా, బంగారుపూత పూసిన రజత పతకాన్ని అందజేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. గతేడాది గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. 2014, సెప్టెంబర్ ఐదో తేదీన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గురుపూజోత్సవానికి హాజరయ్యారు. ఆ తర్వాత హాజరు కాలేదు. ఏటా విద్యాశాఖ మంత్రి హాజరయ్యే వారు. ప్రస్తుతం విద్యాశాఖను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే.

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర పరికరాలు

- అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో అత్యవసర పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో పరికరాల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, గాంధీ ఆస్పత్రి బ్రాండింగ్, శానిటేషన్, ఆపరేషన్ థియేటర్లు, పరికరాల వినియోగం, ఎన్‌సిడి క్లినిక్‌ల పనితీరుపై ఆయన చర్చించారు. అత్యవసర పరికరాలు మరమ్మతులకు వస్తే వెంటనే రిపేర్ చేయించాలని మంత్రి ఆదేశించారు. ఎనిమిదేళ్లు దాటిన పరికరాలను స్క్రాప్ చేయాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులకు సిఎస్ఆర్ నిధులతో బిల్డింగ్ ను అందుబాటులోకి తెచ్చే విషయంపై సమీక్షించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ, కమిషనర్ సంగీత సత్యానారాయణ, టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, ఆరోగ్యశ్రీ సిఇఒ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు నోటిఫికేషన్

- ఈ నెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎక్సైజ్ శాఖ రాష్ట్రంలో కొత్తగా మైక్రోబ్రీవరీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ కోర్ అర్బన్ (టిఎస్‌యుఆర్)తో పాటు ఆరు మున్సిపల్ కార్పొరేషన్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల మూడు నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుం రూ.1,00,000గా నిర్ణయించారు. బార్లు, ఎలైట్ బార్లు, టూరిజం స్థలాలు, హొటళ్లు, రెస్టారెంట్లు మొదలగు ఆహార పదార్థలను అందజేసే సంస్థలు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. మైక్రో బ్రీవరీల ఏర్పాటుకు దరఖాస్తు చేసేవారు 1,000 చదరపు అడుగుల స్థలాన్ని కలిగి ఉండాలి. సంబంధిత శాఖలు జారీ చేసిన అనుమతి పత్రాలను కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, అదిలాబాద్, వరంగల్ కార్పొరేషన్లలో దరఖాస్తులను సంబంధిత ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ల కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లోని మేడ్చల్ జిల్లా పరిధిలో.. బోడుప్పల్, జవహర్‌నగర్, ఫిర్జాదిగూడ, నిజాంపేట్, రంగారెడ్డి జిల్లా పరదిలో... బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్ కార్పొరేషన్లతో పాటు జిహెచ్ఎంసి పరిధిలోనివారు దరఖాస్తులను నాంపల్లిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాల్సిఉంటుంది.

6న సాధారణ సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చుట్టుపక్కల ఈనెల ఆరో తేదీన గణేష్ నిమజ్జనం జరగనుంది. దీంతో ఈనెల ఆరో తేదీన రాష్ట్ర ప్రభుత్వం సాధారణ సెలవును ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్-సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు సాధారణ సెలవు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. వచ్చేనెల రెండో శనివారం ఆయా జిల్లాల్లో పనిదినంగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఎఐ కేపిటల్‌గా తెలంగాణ

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను 'ఎఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ ప్రొక్యూర్‌మెంట్, సప్లయర్ కొలాబరేషన్ సంస్థ జాగర్‌కు చెందిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క టెక్నాలజీనే కాకుండా అన్ని రంగాలకు చెందిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు. ఈ జాబితాలో జాగర్ కూడా చేరడంతో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందని అభిప్రాయపడ్డారు. "కొత్తగా ప్రారంభమైన జిసిసి ద్వారా 180 మందికి ఉపాధి లభిస్తుంది. రాబోయే రోజుల్లో ఆ సంఖ్య 500కు చేరుతుంది. జాగర్ ఏఐ ప్లాట్ ఫాం, ఏఐ ఆధారిత ప్రొక్యూర్‌మెంట్ పరిష్కారాల అభివృద్ధికి వ్యూహాత్మక కేంద్రంగా పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా తయారీ, విద్య, ఎఫ్ఎంసిజీ, రిటైల్ తదితర రంగాలకు సాఫ్ట్‌వేర్, క్లౌడ్ ఆపరేషన్ సేవలను అందిస్తుంది' అని మంత్రి వివరించారు. జిసిసిల ఏర్పాటుకు తెలంగాణ అనుకూలమని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గతేడాది 70 జిసిసిలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఈ ఏడాది 100 జిసిసిలను కొత్తగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. "ఎఐ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేకంగా ఎఐ సిటీని అభివృద్ధి చేయనున్నాం. ప్రపంచానికి ఏఐ నిపుణులను అందించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఎఐ యూనివర్సిటీ, ఎఐ ఇన్నోవేషన్ హబ్ ను ఏర్పాటు చేయబోతున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగర్ సిఇఒ ఆండ్రూ రోస్కో, చీఫ్ డిజిటల్ ఆఫీసర్ గోపీనాథ్ పోలవరపు, చీఫ్ కస్టమర్ ఆఫీసర్ ట్రాయ్ మేయర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాకు నేడు సిఎం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఇటీవల కురిసి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, రహదారులను పరిశీలిస్తారు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన లింగంపేటలో వరదలకు దెబ్బతిన్న కుర్దు ఆర్‌అండ్‌బీ బ్రిడ్జ్‌ను పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి బుడిగిడ గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి, నష్టం జరిగిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం కామారెడ్డి మున్సిపాల్టీలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తారు. అలాగే ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి వరద నష్టంపై జిల్లా అధికారులతో సీఎం సమీక్షిస్తారు.

వన దేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి

- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సమ్మక్క-సారక్క
- మాస్టర్‌ప్లాన్ సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆత్మగౌరవానికి సమ్మక్క సారక్క ప్రతీక అనీ, ఆ వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ., పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క), ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష జరిగింది. అందులో మంత్రులతో పాటు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్టు అధికారులు మంత్రులకు వివరించారు. సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్‌ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు పలు సూచనలు చేశారు. భక్తుల సందర్శనార్థం గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా... తగిన మేరకు డిజైన్లు మార్చాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఒకే వరుసలో ఉండేలా ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా మేడారం జాతరకు రూ. 150 కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి... ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామని ప్రకటించారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలోనూ పూజారులను భాగస్వామ్యం చేస్తామన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితేనే మేడారం అభివృద్ధి మరింత సాధ్యమవుతుందని చెప్పారు. జాతర సమయంలో వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్లు రూపకల్పన చేయాలని ఆదేశించారు.

ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని సూచించారు. బ్యాటరీ వెహికల్స్ ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్ మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమెరాలను ఉపయోగించాలని సూచించారు. జాతర వెళ్లే దారుల్లో ఇందిరా మహిళా క్యాంటీన్ల ద్వారా తినుబండారాలను అందే విధంగా చూడాలన్నారు. మేడారం - ఊరట్టం, మేడారం - కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్న వివరాలను మంత్రులకు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో అవసరమైతే మరొకసారి రివ్యూ చేయాలని మంత్రులు నిర్ణయించారు.

జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు ఎలా అందింది

- రిటైర్డు ఐఎఎస్ జోషిని వివరాలు అడిగిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టు మీకు ఎలా అందిందో చెప్పాలని ఇరిగేషన్ శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి, రిటైర్డు ఐఎఎస్ అధికారి శైలేంద్ర కుమార్ జోషిని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై 10న జరిగే విచారణలో చెప్పాలంది. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టు అమలును నిలిపివేయాలంటూ జోషి దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. కమిషన్ కాపీ ఎలా అందిందని హైకోర్టు ప్రశ్నకు పిటిషనర్ లాయర్ స్పందిస్తూ, ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిందనీ, ఆన్‌లైన్‌లో రిపోర్టు ఉందని చెప్పారు. అసెంబ్లీలో పెడితే ఎమ్మెల్యేలకే రిపోర్టు అందుతుందనీ, ఆన్‌లైన్‌లో రిపోర్టు తీసేయాలని గతంలోనే ఆదేశించామని చెప్పింది. ఈ వ్యవహారంపై అఫిడవిట్ దాఖలు చేస్తామని న్యాయవాది అన్నారు. అప్పటివరకు కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కేసీఆర్, హరీశ్‌లకు వెసులుబాటు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందనీ, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఉందని లేకపోతే పిటిషనర్ ప్రతిష్ఠకు నష్టం జరుగుతుందని చెప్పారు. కమిషన్ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి), 8(సి) కింద నోటీసు ఇవ్వలేదని, సాక్షిగా పిలిచిన కమిషన్ ఏకపక్షంగా ఆరోపణలు చేస్తూ రిపోర్టు ఇచ్చిందన్నారు. విధుల నిర్వహణ సరిగా చేయలేదని కమిషన్ తేల్చడం ఏకపక్షమన్నారు. దీనిపై ప్రభుత్వ స్పందిస్తూ, గతంలో ఆన్‌లైన్‌లో ప్రభుత్వం రూపొందించిన కమిషన్ ఇచ్చిన రిపోర్టును బ్రీఫ్ చేయించింది ఉంచారనీ, హైకోర్టు ఆర్డర్ తర్వాత తొలగించామని చెప్పారు. విచారణ ఈనెల 10కి వాయిదా పడింది.



సిబిఐ పనితీరుపై రాహుల్, రేవంత్ ద్వంద్వ వైఖరి

- కెటిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిబిఐ పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరితో ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బుధవారం ఎర్రవెల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రావు తన అనుచరులతో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కెసిఆర్‌పై విచారణ సిగ్గుచేటన్నారు. సిబిఐ మోడీ జేబు సంస్థ అని రాహుల్ గాంధీ విమర్శించారనీ, సిఎం రేవంత్ రెడ్డి సిబిఐని పొగుడుతున్నారని తప్పుపట్టారు. కాంగ్రెస్, బిజెపిలు కక్షపూరితంగా అక్రమ కేసులతో కెసిఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి 21 నెలల పాలనతో ప్రజలు విసిగిపోయారనీ, కెసిఆర్ అప్పుడే బాగుందని అంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు హామీల జాతర, తర్వాత చెప్పుల జాతర అన్నట్టు రాష్ట్రంలో యూరియా కొరత రైతులను వేధిస్తోందని తెలిపారు. వ్యవసాయ దిగుబడుల్లో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను అనేక ప్రాజెక్టులతో దేశానికే అన్నం పెట్టే స్థాయికి కేసీఆర్ తెచ్చారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి మాటలు సీఎం హోదాకు తగినట్టు లేవనీ, పని చేయడం చేత కాక సాకులు వెతుకుతున్నారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో కేంద్ర మంత్రి కేసీఆర్ ప్రభుత్వం రూ.2.80 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశారని చెప్పారని గుర్తుచేశారు.

సింగరేణి ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో పార్టీ ఎందుకు ఓడిపోయిందో లోతుగా అధ్యయనం చేయాలని కేటీఆర్ సూచించారు. సింగరేణి కార్మికులకు 10 హామీలిచ్చి వాటిలో బీఆర్ఎస్ ఎనిమిదింటిని పూర్తిగా, రెండింటిని పాక్షికంగా అమలు చేసిందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేయాలని కెటిఆర్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో తాను భద్రాచలం, కొత్తగూడెం పర్యటనకు వస్తున్నట్టు తెలిపారు. చిన్న చిన్న మనస్పర్థలు పక్కనపెట్టి, అందరూ కలిసికట్టుగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని కోరారు. ఇంకా మూడేళ్లు అధికార పార్టీలో ఉండే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ ఉండలేక బీఆర్ఎస్‌లో చేరిన ప్రభాకర్ రావు, ఆయన అనుచరులకు కేటీఆర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

కాటేస్తున్న కరెంట్ తీగలు

- లైన్ల పునరుద్ధరణకు ఏటా రూ.100 కోట్లు ఖర్చు
- అయినా మెరుగుపడని విద్యుత్ పంపిణీ వ్యవస్థ
- తరచూ తెగిపడుతున్న వైర్లు.. ప్రమాదాల బారిన ప్రజలు
- బాధ్యులపై చర్యలు శూన్యం
- వరుస ప్రమాదాలతో డిస్కం హడావుడి.. తర్వాత షరా మామూలే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ లైన్లు నగరవాసుల జీవితాల్లో చీకట్లను మిగుల్చుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు.. ఎవరిపై తెగిపడతాయో తెలియని విధంగా పరిస్థితి ఉంది. విద్యుత్ లైన్ల నిర్వహణకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏటా రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా.. ప్రమాదాలు తగ్గకపోగా మరింత పెరుగుతుండటం గమనార్హం. ఘటన జరిగినప్పుడు డిస్కం హడావుడి చేసి తర్వాత చేతులు దులుపుకుంటోంది తప్పితే తగిన పాఠాలు నేర్వడం లేదు. నివారణకు దిద్దుబాటు చర్యలూ చేపట్టడం లేదు. తాజాగా మంగళవారం నాచారంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం విరిగి మీద పడటంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందాడు.

విద్యుత్ తీగలు.. ప్రాణ సంకటం

హైదరాబాద్ మహానగరంలో విద్యుత్ తీగలు ప్రాణ సంకటంగా మారాయి. వరుసగా జరుగుతున్న ప్రమాదాలు నగరవాసుల్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. విద్యుత్ తీగలు తెగడం, తక్కువ ఎత్తులో ఉన్న తీగలు, నిర్వహణ నిర్లక్ష్యం, జంక్షన్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో అమాయకులు ప్రాణం కోల్పోతున్నారు. గతంలో ఒకరిద్దరు చనిపోయిన ఘటనలు ఉండగా.. ఈ ఏడాది రెండు, మూడు భయంకర ఘటనలు జరిగాయి. సాగర్ రింగ్ రోడ్డుకు వెళ్లే దారిలో చింతలకుంట సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మరువక ముందే రామంతాపూర్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. రెండ్రోజుల కిందట నాచారంలో బైక్‌పై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై విద్యుత్ స్తంభం విరిగి పడటంతో అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. కొందరు విద్యుత్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుంగిపోతున్న స్తంభాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు 498 ఉండగా, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,022 ఉన్నాయి. 33 కేవీ యూజీ కేబుల్ లైన్లు 1,280 కిలోమీటర్లు విస్తరించి ఉండగా, 33 కేవీ ఓవర్ హెడ్ లైన్లు 3,725 కిలోమీ టర్లు, 11 కేవీ ఓవర్ హెడ్ లైన్లు 21,643 కిలోమీటర్లు, 11 కెవి యుజి కేబుల్ లైన్లు 957 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,50,992 ఉండగా, వీటి పరిధిలో 63 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 11 కేవీ విద్యుత్ స్తంభం ఎత్తు తొమ్మిది మీటర్లపైగా ఉండగా అదే 33 కెవి స్తంభం 10 మీటర్లకుపైగా ఎత్తు ఉంటుంది. మెజార్టీ సర్వీసు ప్రొవైడర్లు ఐదారు మీటర్ల ఎత్తు నుంచే వైర్లను రోడ్డుకు అటు ఇటుగా ఉన్న ఇళ్లకు లాగుతున్నారు. లైన్ వేయగా మిగిలిన వైర్లను ఉండలుగా చుట్టి స్తంభాలకు వేలాడదీస్తున్నారు. ఇలా ఒక్కో స్తంభానికి కేజీల బరువు ఉన్న తీగలు వేలాడుతున్నాయి. సామర్థ్యానికి మించిన బరువును తట్టుకోలేక ఆయా స్తంభాలు ఏదో ఒక వైపు వంగిపోతున్నాయి.

ఏటా రూ.100 కోట్లు ఖర్చు..

నగరంలోని పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్ హెడ్ చైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడుతుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు వైర్లు సరిచేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చడం, బిఆర్ వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయితే, నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి తప్ప సరఫరా వ్యవస్థ ఏమాత్రం మెరుగుపడటం లేదు. మరణాలు ఆగడం లేదు. మెట్రో జోన్ పరిధి పలు బస్తీల్లోని ఇరుకు గల్లీల్లో ప్రమాదకరంగా మారిన కండక్టర్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 550 కిలో మీటర్లు గుర్తించి ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభించలేదు.

కొన్ని ఉదంతాలు ఇలా..

1. కెపిహెచ్‌బి కాలనీలో షటిల్ ఆడుకుంటూ వెళ్లిన బాలుడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్‌కు గురై ప్రాణం కోల్పోయాడు. 2. సనత్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో విద్యుత్ షాక్‌తో ముగ్గురు మరణించారు.

3. ఈ ఏడాది ఫిబ్రవరిలో షాహీన్‌నగర్‌లో 18 ఏండ్ల బాలిక విద్యుత్ షాక్‌తో చనిపోయింది. 4. మే నెలలో ఎంఎస్ మక్తా గ్రౌండ్‌లో ఆటాడుకుంటూ విద్యుత్ స్తంభాన్ని తాకి 12 ఏళ్ల చిన్నారి మృతిచెందింది. 5. కాటేదాన్ మధుబన్ సమీపంలో 5 నెలల కిందట నియంత్రిక తీగ తెగి డిసిఎంపై పడటంతో డ్రైవర్ మృతి చెందారు. రెండు ఆవులు, మూడు మేకలు మృత్యువాత పడ్డాయి. 6. మూడేళ్ల కిందట పద్మారావునగర్‌లో కవర్ కండక్టర్ తెగిపడటంతో ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి ప్రాణం కోల్పోయాడు. 7. దుండిగల్ మున్సిపాల్టీలో రెండేండ్ల కిందట మల్లంపేట ఆకాశ్ లేవుట్ సమీపంలో కరెంట్ తీగ తెగి రోడ్డుపై పడగా ఆ సమయంలో బైక్‌పై వెళుతున్న స్థానిక నివాసికి కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు. 8. నాలుగేళ్ల కిందట జవహర్‌నగర్ అంబేద్కర్‌నగర్ నోబెల్ పాఠశాల వద్ద ఇంటిపై రేకులు వేస్తుండగా ఎల్ లైను తీగలు తగిలి ఓ వ్యక్తి అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించేలోగా చనిపోయాడు. 9. మల్కారం ప్రాంతంలో ఎనిమిదేండ్ల బాలుడు విద్యుత్ జంక్షన్ వద్ద తీగలు తగిలి విద్యుద్ఘాతంతో మృతిచెందాడు. ఇలా వెలుగు జూసినవి అధికారికంగానే ఇన్ని ఉంటే.. అనధికారికంగా మరెన్ని ప్రమాదాలు జరిగి ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.



అస్థవ్యస్తంగా ఉన్న కరెంటు తీగలు

'గ్రాండ్ షాప్సీ' మేళా 7 వరకు..

హైదరాబాద్ : ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన షాప్సీ సెప్టెంబర్ 7 వరకు గ్రాండ్ షాప్సీ మేళా (జిఎస్ఎం)ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఇందులో ఒక్క కోటి కంటే ఎక్కువ ఉత్పత్తులు రూ.149 కంటే తక్కువ ధరకు లభిస్తాయని పేర్కొంది. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, హోమ్, బ్యూటీ విభాగాల్లో గ్రాండ్ జాక్‌పాట్, స్టీల్ డీల్స్, క్రేజీ డీల్స్‌తో పండుగ షాపింగ్‌ను అనుభవాన్ని పొందవచ్చని ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ మెడ్ కపిల్ తిరానీ తెలిపారు. జిఎస్ఎం సరసమైన షాపింగ్‌తో పండుగ ఆనందాన్ని అందిస్తుందన్నారు. విక్రేతలకు కొత్త కస్టమర్లను చేరుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు.

108, 102, ఎఫ్ హెచ్ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి టియుఎంహెచ్ఇయు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

108, 102, ఎఫ్ హెచ్ఎస్ ఎమర్జెన్సీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు- సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. 108 వాహనంలో 12 గంటలు పని చేసే వారికి కనీసం రూ.18 వేల వేతనం రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనంగా రూ.30 వేలు, ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. 108 సంస్థను మధ్యవర్తుల నుంచి తొలగించి ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు.

ఒక్కో ప్రభుత్వ అంబులెన్స్‌కు ప్రతి నెలా రూ.1.40 లక్షలు చెల్లిస్తుండగా, జివికె-ఇఎంఆర్ఐ సంస్థ నిర్వహిస్తున్న వాహనానికి ఒక్కో దానికి రూ.1.60 లక్షలు చెల్లిస్తున్నారని తప్పుపట్టారు. అయినప్పటికీ జివికె-ఇఎంఆర్ఐ సేవలందించడంలో అనేక లోపాలున్నాయని తెలిపారు. సర్వీసింగ్‌కు పది వేల కిలోమీటర్లు మించకుండా చేయించాలనీ, డీజిల్ కొరత లేకుండా చూడాలని, 33 జిల్లాల్లో సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, రిపేర్లు సర్వీస్ సెంటర్ల మెకానిక్‌ల ద్వారానే చేయించాలని, ఎమర్జెన్సీ వెహికిల్స్ బ్రేక్ డౌన్ అయితే టోయింగ్ వెహికిల్ ద్వారానే తీసుకెళ్లాలని సూచించారు. 24 గంటల సేవల కోసం ప్రభుత్వం నుంచి రూ. లక్షలు జివికె తీసుకుంటుండగా, జిల్లా ప్రోగ్రాం మేనేజర్లు రాత్రి వేళల్లో డౌన్‌లో పెట్టి వాహనాలు నడిపినట్టు సొమ్ము తీసుకుంటున్న వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులతో చేయిస్తున్న అదనపు పని గంటలకు అదనపు వేతనం చెల్లించాలని వారు కోరారు. ప్రతి సంవత్సరం పది శాతం చొప్పున వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. నేషనల్ ఫెస్టివల్, సిక్, ఎర్న్డ్ లీవులు ఇవ్వాలని, ప్రతి మూడు రోజులకు ఒకసారి వీక్లి ఆఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్యాబ్‌లు కాకుండా కాల్ సెంటర్ నుంచి పాతపద్ధతిని కొనసాగించాలనీ, ప్రతి వాహనానికి లొకేషన్‌లో సౌకర్యాలు కల్పించాలనీ, ఏడాదికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, 108 లోగోతో డ్రెస్ ఇవ్వాలన్నారు. ఎమర్జెన్సీ కేసు వాహనంలో ఉన్నప్పుడు ప్రోగ్రాం మేనేజర్ అనుమతి తీసుకునే నిబంధనను మార్చాలనీ, కేవలం సమాచారం ఇస్తే సరిపోయేలా చూడాలన్నారు. విధుల నిర్వహణ సమయంలో రోగుల బంధువులు దాడులు చేస్తున్నారని, చట్టపరంగా రక్షణ కల్పించాలని కోరారు. అమ్మఒడి 102 వాహన సిబ్బంది, ఎఫ్‌హెచ్ఎస్ వాహనాల సిబ్బందికి జీతభత్యాలు పెంచాలనీ, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులతో ఒక టీమ్ వేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

కల్వకుంట్ల గొడవలకు అవినీతే కారణం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి వెలుగులోకి వచ్చిన తర్వాతనే కల్వకుంట్ల కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత సమస్యలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ బిఆర్ఎస్‌పై కవిత ఎన్నోసార్లు దాడి చేశారని గుర్తు చేశారు. గత ఆరునెలలుగా ఆ కుటుంబంలో అంతర్గత పంచాయతీ మొదలైందని తెలిపారు. లక్ష కోట్లు దోచుకున్నాక ఏమీ ఎరుగనట్టు ఇప్పుడు మాట్లాడటమేంటన్నారు. హరీశ్‌రావు వెనుక రేవంత్‌రెడ్డి ఉంటే కాళేశ్వరంపై విచారణకు ఎందుకు ఆదేశిస్తారని ప్రశ్నించారు. పిసి ఘోష్ కమిషన్‌ను ఎందుకు నియమిస్తారని నిలదీశారు. సొంత కుటుంబ సభ్యులే దొంగతనం చేశారంటూ కవిత సాక్ష్యం చెప్పడం మంచి పరిణామమన్నారు.

కవిత ఎపిసోడ్ రాజకీయ కుటుంబ డ్రామా : మంత్రి సీతక్క

కవిత ఎపిసోడ్ పెద్ద రాజకీయ, కుటుంబ డ్రామా అని రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) కొట్టిపడేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. తెలంగాణ జాతిపితగా చెప్పుకునే కేసీఆర్ కుటుంబ సమస్యను పరిష్కరించుకోలేని బలహీన పరిస్థితుల్లో ఉన్నాడా? నలుగురు కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి మాట్లాడి సర్దుబాటు చేయలేని చేరుకున్నాడా? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. కవితను సస్పెండ్ చేయడం ఆ పార్టీ అంతర్గతమనీ, అయితే, కవిత దిష్టిబొమ్మను దహనం చేయించడాన్ని తప్పుబట్టారు.

నీటిగుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

- గణేష్ నిమజ్జనం కోసం స్వగ్రామానికొచ్చి పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు
- తిమ్మారెడ్డిపల్లి తండాలో తీవ్ర విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆ దంపతులు ఉపాధి కోసం తండాను విడిచి పట్టణానికి వెళ్లారు. వారికి ఇద్దరు కొడుకులు.. ఉన్నదాంట్లో సంతోషంగా సాగుతున్న వారి జీవితంలో స్వగ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమం కడుపుకోత మిగిల్చింది. ఇద్దరు పిల్లలు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ప్రాణం కోల్పోయారు.. ఆ తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చారు. ఈ విషాదకర ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిమ్మారెడ్డిపల్లి తండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డిపల్లి తండాకు చెందిన పునియ నాయక్, జయమ్మ దంపతుల కొడుకులు ఆకాష్ (4), అభి (5). కొన్నాళ్లుగా ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వినాయక నిమజ్జనం నేపథ్యంలో తండాకు వచ్చారు. బుధవారం పిల్లలిద్దరూ ఆడుకునే సమయంలో ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలో నిర్మాణ పనుల కోసం తవ్విన నీటి గుంతలో పడిపోయారు. ఎవరూ గమనించకపోవడంతో మృతిచెందారు. కొద్దిసేపటి తర్వాత తల్లి జయమ్మ పిల్లల కోసం వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. చివరకు నీటి గుంతలో చిన్నారులను గమనించి చుట్టుపక్కల వారు బయటకు తీవారు. విగతజీవులుగా మారిన పిల్లలిద్దరినీ చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక ఎస్ఐ రమేష్ తండాకు వెళ్లి పరిశీలించారు.



పిల్లలు మృతి చెందిన గుంతను పరిశీలిస్తున్న పోలీసులు

అవినీతికి కవల పిల్లలు.. బిఆర్ఎస్, కాంగ్రెస్

- బిఆర్ఎస్‌ను కాపాడేందుకు యత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతికి కవల పిల్లల్లాంటివని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శుల సమ్మేళనంలో వారిద్దరూ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, పాలనా లోపాలపై బిజెపి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని, కావాలనే బిఆర్ఎస్ పార్టీని కాపాడేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం స్కాంపై సిబిఐ విచారణకు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నక్సలిజాన్ని ఒక సిద్ధాంతంగా అభివర్ణించడంపై విమర్శించారు. నక్సలిజం ఒక సిద్ధాంతం కాదని, మార్చి నెల చివరి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు 11 ఏళ్లలో సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వాలే తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

పండ్లు విక్రయించేందుకు రూ.7 వేల లంచం

- ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఆర్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పండ్లు విక్రయించేందుకు పర్మిషన్ కోసం మున్సిపల్ ఇన్‌చార్జి ఆర్ఐ రూ. ఏడు వేలు లంచం తీసుకుంటుండగా..ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పండ్లు విక్రయించడానికి కావాల్సిన పర్మిషన్ కోసం రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కర్ణ శ్రీనివాస్‌రావు రూ.10 వేలు లంచం డిమాండ్ చేసి రూ.7 వేలు తీసుకునేందుకు అంగీకరించాడు. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. బుధవారం లంచం తీసుకుంటుండగా.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్ నాంపల్లిలోని అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టినట్టు చెప్పారు.

తాటికుంట రిజర్వాయర్‌లో భార్యాభర్తల గల్లంతు

- స్వయంగా బోటులో వెళ్లి గాలించిన ఎమ్మెల్యే, ఎస్పి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేపల వేట కోసం వెళ్లిన దంపతులు ప్రమాదవశాత్తు పుట్టి బోల్తా పడి తాటికుంట రిజర్వాయర్‌లో గల్లంతయారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. దుబ్బోనిబావి రాముడు, ఆయన భార్య సంధ్య ఇద్దరూ మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తాటికుంట రిజర్వాయర్‌కు చేపల వేట కోసం వెళ్లారు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పి టి శ్రీనివాసరావుతో కలిసి రిజర్వాయర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. స్వయంగా ఎమ్మెల్యే, ఎస్పి బోటులో వెళ్లి గాలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భార్యాభర్తలిద్దరూ రిజర్వాయర్‌లో గల్లంతు కావడంతో చాలా బాధాకరమని అన్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి.. భార్యాభర్తలను గుర్తించాలని పోలీస్ అధికారులకు, ఇతర అధికారులకు సూచించారు. అదేవిధంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాముడు- సంధ్య దంపతుల పిల్లలను ఆదుకుంటామని హామీనిచ్చారు. డిఎస్‌పి వై మొగిలయ్య, గద్వాల సిఐ శ్రీను, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఆర్ఐ ఎమ్మార్వో జాన్సీ, గట్టు ఎస్ఐ కెటి.మల్లేష్, పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మురళి, నాయకులు ప్రభాకర్ గౌడ్, అజమ్, చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు తదితరులు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.



గల్లంతైన వారి గురించి గాలిస్తున్న ఎమ్మెల్యే, ఎస్పి

సహాయక చర్యలపై ఎంపి డికె అరుణ ఆరా..

తాటికుంట రిజర్వాయర్‌లో గల్లంతైన దంపతుల ఆచూకీ కోసం సాగుతున్న సహాయక చర్యలపై మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ ఆరా తీశారు. కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేపల వేటకు వెళ్లిన సమయంలో పుట్టి బోల్తా పడి గల్లంతైనట్టు అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఎంపి అరుణ కలెక్టర్‌కు సూచించారు.

కవిత... కెసిఆర్ వదిలిన బాణం

- అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారు
- మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... కెసిఆర్ వదిలిన బాణం అని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ సందేహం వ్యక్తం చేశారు. ఆమె అన్ని అబద్ధాలే మాట్లాడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై లేనిపోని అభాండాలు వేయడం సరైందికాదని తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెసిఆర్ కుటుంబంలో కవిత కొత్త నాటకం ప్రారంభించారని ఎద్దేవా చేశారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకు కెసిఆర్ కుటుంబం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఆమె రాజీనామా చేయడం శుభ పరిణామంగా తాము భావిస్తున్నాయని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు తుది నిర్ణయం తీసుకునే బృందంలో కవిత కూడా ఒకరని గుర్తు చేశారు. కవిత ప్రమేయం లేకుండా అవినీతి జరిగిందా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల ముందు కవిత రాజీనామా చేసి ఉంటే ప్రజలు అంగీకరించేవారని తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిలో కవిత భాగస్వామ్యం ఉందని చెప్పారు. సంతోష్‌రావు, హరీశ్‌రావు వెనక ఉండాల్సిన అవసరం రేవంత్‌రెడ్డికి ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న సమయంలో ఆమె దోచుకుని, దాచుకున్నారని, ఇప్పుడేమో కవిత నీతి వ్యాఖ్యాలు వల్లే వేస్తున్నారని విమర్శించారు. అవినీతిపరుల విషయాల్లో తల దూర్చడం మాకిష్టం లేదని చెప్పారు. అవినీతిపరులను ఒకే కోణంలో చూస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల నాటికి బిఆర్ఎస్ ఉండదని అనుమానం వ్యక్తం చేశారు. కవిత అమెరికా వెళ్లి రాగానే తన వైఖరి ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఇప్పుడు తన బానాన్ని కెటిఆర్‌పై కాకుండా హరీశ్‌రావుపై ఎందుకు ఎక్కు పెట్టారని ఆయన ప్రశ్నించారు.

ప్రతి మండలంలో రెండు ఎంపిటిసి స్థానాలను ఇవ్వండి - మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వికలాంగుల వినతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మండలంలో రెండు ఎంపిటిసి స్థానాలను వికలాంగులకు కేటాయించాలని వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ కోరింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంలో తగిన చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గృహోపకరణ ఉత్పత్తుల గోదాంపై బిఐఎస్ దాడులు

- రూ.8 లక్షల విలువైన ఉత్పత్తుల జప్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


ఐఎస్ఐ మార్కులేని ఉత్పత్తులను నిల్వ చేశారన్న సమాచారంతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు సికింద్రాబాద్ సిటిసి కాంప్లెక్స్‌లోని గోదాంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బిఐఎస్ ధ్రువీకరణ పొందని రూ.ఎనిమిది లక్షల విలువైన గృహోపకరణాలు గుర్తించి సీజ్ చేశారు. బిఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పివి శ్రీకాంత్ ఆదేశాలతో బిఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, ఎస్‌పిఇ అభిసాయి ఇట్ట, ఎస్ఎస్ఎ శివాజీ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. 225 ఉత్పత్తులకు బిఐఎస్ ధృవీకరణలేదని అధికారులు తెలిపారు. ఐఎస్ఐ మార్క్ లేని, నకిలీ ఐఎస్ఐ ముద్ర ఉన్న ఉత్పత్తులను జప్తు చేసినట్లు వారు వెల్లడించారు. వీటిలో మిక్సర్లు, ప్రెజర్ కుక్కర్లు, సీలింగ్ ఫ్యాన్లు, హీట్ ప్లేట్లు, ఇస్త్రీ పెట్టెలు తదితర వస్తువులున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బిఐఎస్ చట్టం 2016లోని పలు సెక్షన్ 17 ప్రకారం భారత ప్రభుత్వం బిఐఎస్ ధృవీకరణ తప్పనిసరి. ఐఎస్ఐ మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకు రిజిస్ట్రేషన్ మార్కు లేకుండా, బిఐఎస్ అనుమతి పొందకుండా ఉత్పత్తులు తయారు చేసినా, విక్రయించినా, నిల్వ చేసినా మొదటిసారి రెండేళ్ల జైలు శిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధించవచ్చు. రెండోసారి అదే తప్పు చేస్తూ దొరికితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఐదు లక్షల వరకూ జరిమానా, తదుపరి దీనికి పదిరెట్ల వరకూ శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

హైదరాబాద్ నుంచి ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు కెఎల్ఎం విమాన సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి- హైదరాబాద్



హైదరాబాద్ నుంచి నెథర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌కు విమాన సేవలను అందుబాటులోకి తెచ్చామని కెఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెఎల్ఎం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టిన్ స్టినెన్ మాట్లాడుతూ.. ఇరు ప్రాంతాల మధ్య నేరుగా కొత్త విమాన సర్వీసులను ప్రారంభించామన్నారు. భారత్‌లో ప్రస్తుతం బెంగళూరు, ఢిల్లీ, ముంబయి నగరాలకు సేవలను కలిగి ఉన్నామని.. హైదరాబాద్‌ను జోడించడం ద్వారా నాలుగు గమ్యస్థానాలకు విస్తరించినట్లయ్యిందన్నారు. సెప్టెంబర్3న తొలి విమానం కెఎల్ 874 రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఆమ్‌స్టర్‌డ్యామ్ స్కిపోల్ ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరిందన్నారు. దీంతో ప్రపంచ నెట్‌వర్క్‌ను 160కి పైగా గమ్యస్థానాలకు చేర్చినట్లయ్యిందన్నారు. భారత్ నుంచి వారానికి 27 విమానాలు రాకపోకలను కొనసాగిస్తాయన్నారు.



హైదరాబాద్‌లో తొలిసారిగా.. దేశీయ పరికరంతో టీర్ ప్రొసీజర్

- గ్లెనీగల్స్ ఆస్పత్రిలో 70 ఏళ్ల వృద్ధుడికి చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

తీవ్రమైన గుండెవ్యాధితో బాధపడుతూ తన రోజువారీ పనులు కూడా చేసుకోలేక.. కాళ్లు వాచి, ఊపిరి అందక ఇబ్బంది పడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి హైదరాబాద్‌లోని గ్లెనీగల్స్ ఆస్పత్రిలో ప్రాణాలు కాపాడి చికిత్స చేశారు. పదవీ విరమణ చేసిన ఆ ఉద్యోగి తీవ్రమైన మైట్రల్ రీగర్జిటేషన్ (ఎంఆర్) అనే ప్రాణాంతక గుండెవ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించామని ఆ హాస్పిటల్ వైద్యుల సాయి సుధాకర్ తెలిపారు. "తీవ్రమైన ఎంఆర్ ఉన్న రోగులకు ఇతర ఆరోగ్య సమస్యల వల్ల శస్త్రచికిత్స చేయడం చాలా ముప్పుతో కూడుకుంటుంది. అలాగని చికిత్స చేయకుండా వదిలేస్తే, ఎంఆర్ వల్ల దాదాపు 50 శాతం మంది రోగులు ప్రాణాలు కోల్పోతారు. ఏడాదిపాటు చికిత్స చేయకుండా ఆపితే మరణాల రేటు 57 శాతంఉంటుంది. శస్త్రచికిత్స చేయించుకోలేనివారికి టీర్ ప్రొసీజర్ చాలా సురక్షితమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయం. అందులోనూ మైక్లిప్ అనేది పూర్తిగా మన దేశంలోనే తయారైన, అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీ కలిగిన పరికరం. విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాటి కంటే ధర కూడా తక్కువ. దాంతో భారతీయ రోగులకు ఇది చాలా అందుబాటులో ఉంటుంది" అని డాక్టర్ సుధాకర్ అన్నారు.

నగరంలో సాల్ట్ రెండో అవుట్‌లెట్ ఏర్పాటు

హైదరాబాద్ : రెస్టారెంట్ చెయిన్ సాల్ట్ హైదరాబాద్‌లో తన రెండో అవుట్‌టెల్‌ను తెరిచినట్లు వెల్లడించింది. చెన్నయ్, బెంగళూరు, పూణెలో ఈ సంస్థ కార్యకలాపాలను కలిగి ఉంది. సాంప్రదాయ భారతీయ వంటకాలను ఆధునిక రుచులతో మిళితం చేస్తూ భోజన ప్రియులను ఆకర్షిస్తోన్నామని ఆ సంస్థను లీడ్ చేస్తోన్న చెఫ్ బాలచందర్ పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో అవినీతిపై విచారణ జరపాలి : టిజెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పాలననలో అన్ని రంగాల్లో అవినీతి జరిగిందని కల్వకుంట్ల కవిత పరోక్షంగా చెప్పారని, వాటిపై న్యాయ విచారణకు ఆదేశించాలని తెలంగాణ జన సమితి (టిజెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ ఒక ప్రకటన విడుదల చేసింది. పోరాటాల తెలంగాణను పంపకాల కుటుంబం ఆగం చేసింది అనడానికి నిదర్శనమే కవిత ఎపిసోడ్ నిదర్శనమని విమర్శించారు. కెసిఆర్, ఆయన కుటుంబం తెలంగాణలోని అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసి, ఆర్థిక కుంభకోణాలకు తెగబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ, గొర్రెల పంపిణీ వరకు అన్ని రంగాల్లో అవినీతి జరిగిందని కవిత ఆరోపణలతో తాము మొదట్నుంచి బిఆర్ఎస్ అవినీతిపై చేస్తున్న ఆరోపణలతో రుజువైందని పేర్కొన్నారు. కాళేశ్వరం అవినీతి కేంద్రంగా మారబోతుందని గతంలో కోదండరాం ఆరోపించినందుకే ఆయన ఇంటిని ధ్వంసం చేశారని విమర్శించారు.

యువకుడి వేధింపులకు విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువకుడి వేధింపులు తట్టుకోలేక బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో పరిధిలో జరిగింది. వనస్థలిపురం సిఐ మహేష్ ఆధ్వర్యంలో అడ్మిన్ ఎస్ఐ గిరీష్ కుమార్, మృతురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం ఈశ్వరమ్మ కాంప్లెక్స్‌లో నివసిస్తున్న బాణోతు అచ్చాలి/అచ్చమ్మ- చిన్న మున్నయ్య దంపతుల రెండో కుమార్తె బాణోతు నందు (21) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆమెకు కొద్ది రోజుల కిందట సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మూన్లనాయక్ తండాకు చెందిన ధరావత్ వినీత్‌తో పరిచయం ఏర్పడింది. అతను తరచూ యువతికి ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ.. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని ఒత్తిడి చేసేవాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆమెతో చేసిన చాటింగ్‌ను బయట పెడతానని బెదిరించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక మంగళవారం అర్ధరాత్రి యువతి తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.